సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



బీచ్‌రోడ్డు: ఇండియన్ కోస్ట్ గార్డ్ రైజింగ్ డేను ఆదివారం నిర్వహించారు. తీర గస్తీ నౌకతో రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, కేంద్ర, రాష్ట్ర ఉన్నతాధికారులు కుటుంబ సభ్యులతో డే ఎట్ సీని నిర్వహించారు.



పోటాపోటీ.. స్వచ్ఛతలో మేటి

వార్డుల అభివృద్ధిపై జీవీఎంసీ పోటీ నిర్వహించింది. ఉత్తమ వార్డులకు అవార్డులనందించి ప్రోత్సహించింది. 8లో



ఉమ్మడి విశాఖ సత్తా

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.

ఆడుదాం ఆంధ్ర ఫైనల్స్‌కు

సీఎం జగన్

- రేపు విశాఖకు ముఖ్యమంత్రి రాక
- క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించనున్న వైనం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం విశాఖ రానున్నారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర స్థాయి ముగింపు వేడుకల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఈ మేరకు ఆదివారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. మంగళవారం సాయంత్రం 5.20 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురవాడ ఐటీ హిల్స్–3 వద్ద గల హెలీప్యాడ్ వద్దకు 5.30 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన 6 గంటలకు పీఎం పాలెం వైఎస్సార్ క్రికెట్ స్టేడియంకు చేరుకుంటారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ (చివరి ఐదు ఓవర్లు) సీఎం వీక్షిస్తారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారు. రాత్రి 8.05 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 8.30 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 8.35 గంటలకు విమానంలో గన్నవరంకు బయలుదేరుతారు.



పెళ్లి కళ వచ్చేసింది...!

- మోగనున్న పెళ్లి బాజాలు
- జోరుగా సాగుతున్న అనుబంధ వ్యాపారాలు
- ఈనెల 14న అధికంగా వివాహాలు
- సన్నాహాల్లో నిమగ్నమైన పెళ్లివారు

అల్లిపురం : మాఘ మాసం ప్రారంభమవడంతో పలు జంటలు వేద మంత్రాల సాక్షిగా జీవితాన్ని పండించుకునేందుకు కొంగులు ముడి వేసుకోనున్నాయి. వివాహాలు చేసుకునేందుకు ఇప్పటికే పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నెల 13వ తేదీ ముహూర్తంతో వివాహాల కోలాహలం ఆరంభం కానుంది. దీంతో కల్యాణ మండపాలతో పాటు పురోహితులు, కేటరింగ్, సన్నాయి మేళం వారికి గిరాకీ పెరిగింది. సుమారు రెండు నెలల విరామం అనంతరం వివాహాలు మొదలు కావడంతో జిల్లా వ్యాప్తంగా సందడి నెలకుంది.

ఈ ఐదు నెలలే ముహూర్తాలు

ఈ ఏడాది **ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలతో** పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో శుభముహూర్తాలు ఉన్నాయి. దీంతో పెళ్లి చేసుకునేందుకు యువత ఉత్సాహం చూపుతోంది. మరో పక్క నూతన గృహప్రవేశాలు, గృహ నిర్మాణాలకు శంకుస్థాపనలు జోరందుకో నున్నాయి. ఆదివారం నుంచి మొదలైన పెళ్లి సందడి మరో మూడు నెలలు వరకు కొనసాగుతాయని పురోహితులు చెబుతున్నారు. ఆ తరువాత గురు మౌఢ్యం, శుక్రమౌఢ్యం, శూన్య మాసం రావడంతో మే, జూన్, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వివాహాది కార్యక్రమాలకు శుభముహూర్తాలు లేవు.

ఊపందుకోనున్న వ్యాపారాలు

పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కానుండడంతో జిల్లాలో పలు వ్యాపారాలు జోరుగా సాగనున్నాయి. షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు, డ్రెస్సెస్, జ్యూవెల్లరీ దుకాణాలు, లేడీస్ ఎంపోరియంలు, ఫొటో స్టూడియోలు, వీడియోగ్రఫీ సెంటర్లు, ప్రీ వెడ్డింగ్ షూట్ స్టూడియోలు, ఫంక్షన్ హాల్స్, క్యాటరింగ్ కేంద్రాలు, ఫ్లవర్ డెకరేటర్స్, వంట మాస్టర్స్ ఇలా పలు వ్యాపారాలు పుంజుకోనున్నాయి. ఇప్పటికే ఇందుకు అవసరమైన ఏర్పాట్లను వ్యాపారాల నిర్వాహకులు చేసుకున్నారు. ప్రధానంగా విశాఖ నగరంతో పాటు గాజువాక, గోపాలపట్నం ప్రాంతాల్లో బంగారం, వస్త్ర వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. దేశంలో వివిధ ప్రాంతాల నుంచి నూతన డిజైన్లతో కూడిన వస్త్రాలను వ్యాపారులు తీసుకవచ్చి తమ దుకాణాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచారు. వినియోగదారులను ఆకర్షించడానికి డిస్కౌంట్‌లు, ఇతర బహుమతులను అందించడానికి ప్రయత్నిస్తున్నారు.

ముహూర్తాలు

ఫిబ్రవరి : 12, 13, 17, 24, 25, 26, 29 తేదీలు
మార్చి: 1,2,4,5,6,7,10,11,12 తేదీలు
ఏప్రిల్: 18, 19, 20, 21, 22, 26 తేదీలు
నవంబర్‌లో 12, 13, 16, 17, 18, 22, 23, 25, 26, 28, 29 తేదీలు
డిసెంబర్‌లో 4, 5, 9, 10, 14, 15 తేదీలు



ఉపాధి అవకాశాలు మెండు..

గత కొంతకాలంగా పనులు లేక డీలాపడిన శుభకార్యాలకు అనుబంధ వ్యాపారాలు అయిన పురోహితులు, క్యాటరింగ్, షామియానాలు, కల్యాణ మండపాల వారితో పాటు లైటింగ్, పువ్వుల డెకరేషన్, ఫొటో స్టూడియోల వారికి, ఐస్‌క్రీం, మినరల్ వాటర్, హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, సాంస్కృతిక కళాకారులు, ఈ ముహూర్తాల్లో చేతి నిండా పని దొరకడంతో ఆయా రంగాల్లో రాణిస్తున్న వారికి ఇది శుభసమయమని చెప్పవచ్చు.



కల్యాణమండపాలకు డిమాండ్

ఏప్రిల్ తర్వాత నవంబర్ వరకు ముహూర్తాలు లేకపోవడంతో ఈ మూడు నెలల్లోనే శుభకార్యాలు జరిపించేందుకు ఆసక్తి కనబరచడంతో ప్రస్తుతం కల్యాణ మండపాలకు కూడా డిమాండ్ బాగా పెరిగింది. అదే రీతిలో షామియానాలు, క్యాటరింగ్ పరిశ్రమ కూడా ఊపందుకుంది. బలమైన ముహూర్తాలు ఉండే రోజుల్లో డిమాండ్ బాగా ఉండటంతో ఇప్పటికే కల్యాణమండపాల బుకింగ్‌లు పూర్తి చేసుకున్నట్లు మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

అదే విధంగా వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లు, పురోహితులను ఇప్పటికే మాట్లాడుకుని సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. రానున్న మూడు నెలల కాలంలో సిటీతో పాటు జిల్లాలో సుమారు 40 వేల పైగా జంటలు ఒక్కటవుతాయని అంచనా. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 21, 29 తేదీల్లో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. దీంతో పెళ్లిళ్లకు హాజరయ్యే వారంతా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. రైలు, బస్సు సర్వీసులకు రిజర్వేషన్లు చేసుకునే ప్రయత్నంలో పడ్డారు.

ఐదు నెలలు మాత్రమే శుభముహూర్తాలు



ఈ ఏడాది కేవలం ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, నవంబర్, డిసెంబర్ నెలల్లో మాత్రమే శుభముహూర్తాలు ఉన్నాయి. మే, జూన్, ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో మూఢం, శూన్యమాసాలు రావటంతో ముహుర్తాలు లేవు. దీంతో శుభకార్యాలు నిర్వహణకు ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నారు.

– బులుసు సాయికృష్ణ శర్మ,
వేద పండితులు, అల్లిపురం

ఇప్పటికే బుకింగ్‌లు ఒప్పకున్నాం



ఇప్పటికే పెళ్లిళ్లకు బుకింగ్‌లు మొదలయ్యాయి. ఒక రోజు మూడు నుంచి నాలుగు పెళ్లిళ్లు ఉన్నాయి. ముఖ్యంగా ఫిబ్రవరి 14, 21, 29 తేదీల్లో ఎక్కువగా పెళ్లిళ్లు ఉన్నాయి. ఆ సమయంలో వర్కర్లు దొరకడం కూడా కష్టంగా ఉంది. అయినా వచ్చిన అవకాశాన్ని దొరకబుచ్చుకుంటున్నాం. డిమాండ్ ఉన్న రోజుల్లో డబుల్ పేమెంట్ కూడా ఇచ్చుకునేందుకు సిద్ధపడుతున్నాం.

– మహ్మద్ ఖాజా, ఈవెంట్ నిర్వాహకుడు

న్యూస్‌రీల్

అయోధ్యకు నగరవాసులు



రైల్వే స్టేషన్‌లో అయోధ్య ప్రయాణికులు

తాటిచెట్లపాలెం : ఇటీవల అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట చేసిన ప్రాంతాన్ని దర్శించుకునేందుకు నగర వాసులు పయనమయ్యారు. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో నడుపుతున్న పలు ప్రత్యేక రైళ్లలో ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు ఆయోధ్యకు తరలివెళ్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం కాకినాడలో బయల్దేరిన కాకినాడ – ఆయోధ్య ధాం ఆస్తా స్పెషల్ రైలు ఆదివారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఒకటో నంబర్‌కు చేరుకుంది. ఈ స్పెషల్ రైలు రాత్రి 10.20గంటలకు విశాఖ నుంచి అయోధ్యకు బయల్దేరింది. ఇప్పటికే టికెట్స్ బుక్ చేసుకున్న నగర పరిసర ప్రాంత వాసులు సుమారు 350 మంది విశాఖలో ఈ ప్రత్యేక రైలెక్కి అయోధ్యకు పయనమయ్యారు. రైల్వే స్టేషన్ స్టేషన్‌మేనేజర్ అరుణశ్రీ, ఇతర సిబ్బంది ఆధ్వర్యంలో గవర్నమెంట్ రైల్వే పోలీస్, రైల్వే భద్రతా దళం సిబ్బంది పర్యవేక్షించారు.

నేడు డయల్ యువర్ మేయర్, 'జగనన్నకు చెబుదాం'

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి 11 వరకు మేయర్ ఛాంబర్లో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి డయల్ యువర్ మేయర్ కార్యక్రమం చేపట్టనున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం ((గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. డయల్ యువర్ మేయర్ కార్యక్రమంలో పాల్గొనే వారు టోల్ ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేసి సమస్యలు తెలపవచ్చు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

సీతమ్మధార: తనను ఓ మైనర్ లైంగికంగా వేధించాడని ఓ బాలిక ఫోర్త్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక, పోలీసులు తెలిపిన వివరాలివీ.. విజయనగరానికి చెందిన బాలిక విశాఖలోని ఓ నర్సింగ్ కళాశాలలో ఇటీవల చేరింది. కైలాసపురానికి చెందిన బాలుడు ఇన్‌స్టాగామ్‌లో ఆమెకు పరిచయం అయ్యాడు. క్రమంగా దగ్గరయ్యాడు. ఇదే అదనుగా బాలికను కైలాసపురంలోని తన అక్క ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అరకు తీసుకెళ్లి.. అక్కడ కూడా లైంగికదాడి చేసినట్లు బాలిక ఫిర్యాదులో పేర్కొంది. అక్కడి వీడియోలు, ఫోటోలు తీశాడని, వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరిస్తున్నాడని పోలీసులకు తెలిపింది. దీనిపై ఫోర్త్‌టౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తూర్పు ఏసీపీ బి.ఎం .జయరాంప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రయాంగిల్.. స్ట్రగుల్

- మూడు గ్రూపులుగా గంటా, కోరాడ, సందీప్
- టీడీపీ–జనసేన మధ్య కొనసాగుతున్న పంచాయితీ



తగరపువలస: భీమిలిలో టీడీపీ, జనసేన పార్టీల మధ్య మూడు ముక్కలాటకు తెరలేచింది. భీమిలి టికెట్ తమకంటే తమకని టీడీపీ నుంచి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి పంచకర్ల సందీప్ ప్రకటించుకుని.. పార్టీల క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తున్నారు. భీమిలిలో పోటీపై చంద్రబాబు, పవన్‌లు ఏకాభిప్రాయానికి వచ్చినా.. తగ్గేదేలేదని ఇక్కడి ఇరు పార్టీల కార్యకర్తలు, నాయకులు బాహాటంగానే విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో చేస్తున్న పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎవరికివారు యమునాతీరే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. కోరాడ, గంటా, పంచకర్ల వర్గాలు నిర్వహించే కార్యక్రమాలకు మరొక వర్గం గానీ, పార్టీల నాయకులు గానీ హాజరుకావడం లేదు. 2019 ఎన్నికల సమయంలో భీమిలి నుంచి విశాఖ ఉత్తర నియోజకవర్గానికి వలస వెళ్లిపోయిన గంటా శ్రీనివాసరావు నాలుగున్నరేళ్లుగా ఇక్కడి కార్యకర్తలు, నాయకుల వైపు కన్నెత్తి కూడా చూడలేదు. అలాగే చంద్రబాబు ఉత్తరాంధ్ర పర్యటనకు వచ్చినా కలవడానికి వెళ్లలేదు. ఈ నెల 10న విశాఖ వచ్చిన లోకేష్‌ను కూడా గంటా కలవకపోవడం విస్మయపరుస్తోంది. ఇక గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సబ్బం హరి మరణంతో ఇక్కడ పార్టీ దాదాపు దిక్కులేనిదిఅయిపోయింది. దీంతో చాలా వరకు వైఎస్సార్ సీపీలో చేరిపోయారు. టీడీపీలో మిగిలిన వారు సైతం రెండుగా విడిపోయి కోరాడ, గంటా వర్గీయులుగా చలామణి అవుతున్నారు. పార్టీ కష్టకాలంలో దూరంగా వెళ్లిపోయిన గంటా శ్రీనివాసరావు ఇప్పుడు మళ్లీ ఏ ముఖం పెట్టుకుని వస్తారని కోరాడ వర్గీయులు అంటున్నారు. చంద్రబాబు, లోకేష్‌లు గంటాతో మాట్లాడటానికి కూడా ఇష్టపడటం లేదని కోరాడకే టికెట్టు ఇవ్వనున్నట్టు అతని వర్గీయులు అంటున్నారు. ఇటీవల ఆ పార్టీ చేసిన సర్వేలో కూడా కోరాడ పేరు ఒక్కటే ఉందంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 15 లోగా గంటాకు పార్టీ అధినాయకత్వం భీమిలి టికెట్టు కేటాయిస్తుందని అతని వర్గం ఇటీవల భోగాపురం సమీపంలోని సవరవిల్లి వద్ద సమావేశంలో ప్రకటించింది.

ఆటలో అరటి పండు

2019 ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన టీడీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లలో నాలుగో వంతు ఇక్కడ జనసేన అభ్యర్థికి వచ్చాయి. ఇటీవల సేన తరపున సందీప్ పాదయాత్ర పేరుతో వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాలకు పొత్తు కుదరలేదనేది స్పష్టమయింది. ఏ ఒక్క టీడీపీ కార్యకర్త, నాయకుడు సేన వెంట వెళ్లేందుకు ఇష్టపడలేదు. సందీప్ పోటీకి డబ్బులు సిద్ధం చేసుకున్నారని, ఈ నెల 14న సందీప్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తారని సేన కార్యకర్తలు చేస్తున్న వ్యాఖ్యలను.. టీడీపీ వర్గీయులు టేక్ ఇట్ ఈజీగా తీసుకుంటున్నారు. భీమిలిలో నూకాలమ్మ జాతరకు ముందే జరుగుతున్న ఈ పొలిటికల్ మూడు ముక్కలాటను ఇక్కడి ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ వేదికగా మంగళవారం ఆడుదాం ఆంధ్రా ముగింపు వేడుకలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై ఆదివారం వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనను అధికారులంతా సమన్వయంతో విజయవంతం చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. కలెక్టర్ ఎ.మల్లికార్జునతో కలిసి అధికారులంతా స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రద్యుమ్న మాట్లాడుతూ సమన్వయ లోపం తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంగళవారం సాయంత్రం జరిగే కార్యక్రమ షెడ్యూల్‌ను అధికారులకు వివరించారు. అన్ని విభాగాల అధికారులు చేపట్టాల్సిన బాధ్యతలను వివరించారు.

పక్కా ఏర్పాట్లు

కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం సమష్టిగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. క్రీడాకారులతో పాటు సాధారణ ప్రజలకు ఆహారం, తాగునీటి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం సజావుగా జరిగేందుకు జిల్లా యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం, శాప్ నుంచి ఒకొక్క ఇన్‌చార్జిని నియమిస్తున్నామని వెల్లడించారు. స్టేడియం లోపల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, వీక్షకులు వచ్చి కూర్చునేందుకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. స్టేడియం లోపల ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు అనువుగా ప్రధాన స్టేజీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ సరఫరా, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, వైద్యశిబిరాలు, పారిశుధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. మధురవాడ ఐటీ హిల్స్‌వద్ద ఏర్పాటు చేసిన హెలీపాడ్‌ను అధికారులంతా పరిశీలించారు. ఈ సమావేశంలో శాప్ వీసీఎండీ ధ్యాన్‌చంద్, పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జీవీఎంసీ ఏడీసీ కే.ఎస్, విశ్వనాథన్, డీసీపీ మణికంఠ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్టేడియంలో ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, కలెక్టర్ మల్లికార్జున ఇతర అధికారులు

బీఆర్‌టీఎస్ నిర్వాసితులకు అండగా..

- మిగులు స్థలాల్లో నిర్మాణాలకు అనుమతి
- నిర్వాసితుల ఆనందం
- ఉత్తర్వులు జారీచేసిన దేవదాయశాఖ కమిషనర్
- ఎమ్మెల్యే ముత్తంశెట్టికి స్థానికుల అభినందనలు

సింహాచలం : అడవివరంలోని పాత గోశాల జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ విస్తరణలో నిర్మాణాలు కోల్పోయిన నిర్వాసితులకు గుడ్ న్యూస్. మిగులు స్థలంలో తిరిగి నిర్మాణాలు చేసుకునేందుకు దేవదాయశాఖ అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఈ నెల 10న దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత ఉత్తర్వులను జీవీఎంసీ కమిషనర్‌కు, సింహాచలం దేవస్థానం ఈవోకు పంపించారు. వివరాల్లోకి వెళ్తే... పాత గోశాల జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ జరగాల్సి ఉంది. తొలిఫేజ్‌లో పాత గోశాల నుంచి తొలిపావంచా వరకు బాధితులకు నష్టపరిహారం అందించారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే పలువురు నిర్వాసితులు నిర్మాణాలు కోల్పోగా మిగులు నిర్మాణ స్థలాల్లో తిరిగి నిర్మాణాలు చేసుకున్నారు. కాగా శ్రీవరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలిపావంచా నుంచి అడవివరం జంక్షన్ వరకు రెండో ఫేజ్‌లో విస్తరణకు సంబంధించి నష్టపరిహారం విషయం కొలిక్కిరాకపోవడంతో దీర్ఘకాలంగా సమస్య అలాగే ఉంది. ఇటీవల నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ దష్ట్యా, సింహాచలం దేవస్థానానికి వచ్చేభక్తుల సంఖ్య విపరీతంగా పెరగడంతోను అడవివరం నుంచి పాత గోశాల వెళ్లే బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణ ఎంతో ఆవశ్యమైంది. దీంతో ఇటీవల పాత గోశాల నుంచి అడవివరం జంక్షన్ వరకు ఉన్న నిర్వాసితుల నిర్మాణాలను తొలగించారు. ఈ క్రమంలో బాధితులకు వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అండగా నిలిచి మెరుగైన ప్యాకేజీ వచ్చేందుకు కృషి చేశారు. దీనిలో భాగంగా నాలుగు టీడీఆర్‌లు అందించారు. అలాగే అందరికీ ఆమోదయోగ్యమైన నష్టపరిహారాన్నీ అందించారు. టీడీఆర్‌ల వేల్యూలో వ్యత్యాసం నెలకొనడంతో విషయాన్ని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పూర్తిగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు జగనన్న కాలనీల్లో 50 గజాల స్థలం ఇచ్చేందుకు కూడా నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యంగా ఇళ్లు కోల్పోగా మిగిలిన స్థలంలో నిర్మాణం చేసుకునేందుకు దేవదాయశాఖ నుంచి అనుమతి తప్పనిసరి కావడంతో ఆ శాఖ కమిషనర్ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ కూడా విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్ దృష్టిలో పెట్టారు. ఈ తరుణంలోనే దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశాలు జారీచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తొలిపావంచా నుంచి అడవివరం కూడలి వరకు 267 నిర్మాణాలు దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఇళ్ల మరమ్మతులు, తిరిగి ఇళ్లు నిర్మించుకోవడం, ఫేసు లిఫ్టింగ్ పనులు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణం కోల్పోగా ఎంత మిగిలిందో అందులోనే తిరిగి పునః నిర్మాణం చేసుకోవాలని ఆదేశించింది. మరెలాంటి ఖాళీ స్థలాల్లోనూ నిర్మాణం చేసుకోకూడదని సూచించింది. దాని ప్రకారం బాధితులు ప్రస్తుతం తాము ఇళ్లు తొలగించగా మిగిలిన స్థలంలో నిర్మాణాలు చేసుకునే వీలు కలిగింది.



ముత్తంశెట్టి శ్రీనివాసరావును సత్కరిస్తున్న 98వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నిర్వాసితులు

ముత్తంశెట్టికి అభినందనలు

బీఆర్‌టీఎస్ నిర్వాసితులకు అండగా నిలిచి వారికి అన్ని విధాలా న్యాయం చేసిన మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు పలువురు నిర్వాసితులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ 98వ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం ఆధ్వర్యంలో నగరంలోని ముత్తంశెట్టి స్వగృహంలో ఆదివారం పులువురు నిర్వాసితులు కలిశారు. ముత్తంశెట్టిని సత్కరించారు. ఎర్ర వరహనరసింహం మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఉన్న బీఆర్‌టీఎస్ సమస్య పరిష్కారానికి ముత్తంశెట్టి కృషి మరువలేమన్నారు. 1:4 రేషియాలో టీడీఆర్‌లు ఇచ్చేందుకు ముత్తంశెట్టి ఎంతో కృషి చేశారన్నారు.

పారదర్శకంగా రైతులకు కార్డుల జారీ



రైతులకు రెన్యువల్ కార్డులు అందిస్తున్న మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్

సీతమ్మధార: జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రైతుబజార్లకు చెందిన రైతుల భూములు, పంటలను రెవెన్యూ, వ్యవసాయం, ఉద్యానవన శాఖ అధికారులచే పరిశీలన చేయించి కార్డులు రెన్యువల్ చేసినట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌లో 276 మంది అర్హులైన రైతులకు ఆదివారం రెన్యువల్ చేసిన గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా రైతులకు కార్డులు జారీ చేసినట్లు చెప్పారు. భూములు లేని, రైతుబజార్‌కు రాని రైతుల కార్డులను రద్దు చేశామన్నారు. వీరిస్థానంలో ఇటీవలే కొత్త కార్డులు జారీ చేసినట్లు వెల్లడించారు. నగరంలోని 13 రైతుబజార్లకు సంబంధించి కొంత మంది రైతులు డాక్యుమెంట్లు ఇవ్వలేదని.. వీరికి రెండు వారాల సమయం ఇస్తున్నామన్నారు. అప్పటికి ఇవ్వని పక్షంలో వారి కార్డులను వేరే వారికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. రైతుబజార్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాడు–నేడులో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామన్నారు. కొత్తగా గాజువాక, నరసింహనగర్, మధురవాడ రైతుబజార్లలో సాయంత్రం వేళ విక్రయాలు ప్రారంభించినట్లు చెప్పారు. సీతమ్మధార రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

పీఎంపాలెం: రోడ్డు దాటుతుండగా ఓ వ్యక్తిని ఆటో ఢీకొంది. ఆదివారం జరిగిన ఈ ఘటనలో ఆయన మృతి చెందాడు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ధర్మవరం పెద్దరువుపేటకు చెందిన సాధు సూర్యనారాయణ(55) 15 ఏళ్ల నుంచి కొమ్మాదిలో నివసిస్తున్నాడు. అతను ఇక్కడ కూలి పనులు చేస్తుండగా.. అతని భార్య ఇల్లమ్మ స్వగ్రామంలో వ్యవసాయ పనులు చేస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో కొమ్మాది కూడలిలో జాతీయ రహదారి దాటుతుండగా.. కొమ్మాది రోడ్డు నుంచి హైవేపైకి వస్తున్న ఆటో డ్రైవర్ సూర్యనారాయణను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి కొన ఊపిరితో ఉన్న అతన్ని సమీపంలోని గాయత్రి ఆస్పత్రికి తరలించగా.. అక్కడ ప్రాణాలు విడిచాడు. అతనికి పిల్లలు లేరు. వరసకు మనవడు అయిన సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పోటాపోటీ.. స్వచ్ఛతలో మేటి

- పారిశుధ్య నిర్వహణపై వార్డుల మధ్య పోటీ
- ఫలితాన్నిచ్చిన జీవీఎంసీ వినూత్న కార్యక్రమం
- విజేతలకు ఎకో వైజాగ్ అవార్డ్స్‌తో సన్మానం



91వ వార్డులో మెయిన్‌రోడ్డును శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

డాబాగార్డెన్స్: ప్రణాళికతో ముందుకు సాగడం, బలాబలాలు అంచనా వేయడం, సామర్థ్యాలను పెంచుకోవడం, నూతనత్వాన్ని ప్రోత్సహించడం తద్వారా స్పష్టమైన లక్ష్యాలు సాధించవచ్చు. ఇదే విధానాన్ని అమలు చేసి.. మంచి ఫలితాలు సాధించింది జీవీఎంసీ. వార్డుల అభివృద్ధి, మెరుగైన పారిశుధ్య నిర్వహణకు 98 వార్డుల్లో పోటీ పెట్టింది. ఇందులో మెరుగైన ఫలితాలు సాధించిన వార్డులకు స్వచ్ఛత ఈకో వైజాగ్ అవార్డ్‌లను బహూకరించింది. ఈ కార్యక్రమం ద్వారా పారిశుధ్యం నిర్వహణలో మెరుగుదల, వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నగర పౌరుల్లో స్పృహ, భాగస్వామ్యం పెరిగింది.

వినూత్నంగా ఎకో వైజాగ్

ఎకో వైజాగ్ కార్యక్రమాల్లో భాగంగా జీవీఎంసీ అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఎకో బ్లూలో నీటి సంరక్షణకై సముద్ర గర్భంలో పేరుకుపోతున్న వ్యర్థాలు వెలికితీయించింది. ఎకో జీరో ప్లాస్టిక్‌లో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు 10 బృందాలను ఏర్పాటు చేసి.. నిరంతరం పర్యవేక్షిస్తోంది. నగర పరిధిలోని సముద్ర తీరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రూ.12.55 కోట్లతో ఏడు బీచ్ క్లీనింగ్ యంత్రాలను వినియోగిస్తోంది. ఈ క్రమంలో 98 వార్డుల్లో మెరుగైన పారిశుధ్యం కోసం సేవా అవార్డ్స్(స్వచ్ఛత ఎకో వైజాగ్ అవార్డ్స్)ను ప్రవేశపెట్టి థర్డ్ పార్టీ ద్వారా ఎంపిక చేసింది. ఉత్తమ ప్రగతి సాధించిన వార్డులకు నగదు ప్రోత్సాహకాలను అందజేసింది.

స్వచ్ఛతలో తొలి 10 వార్డులు..

జీవీఎంసీ 8 జోన్ల పరిధిలోని 98 వార్డుల్లో తొలిసారిగా నిర్వహించిన సేవా అవార్డుల్లో 52వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో ఆ వార్డుకు రూ.20 లక్షల ప్రోత్సాహక నగదు అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన 91వ వార్డుకి రూ.10లక్షలు, తృతీయ స్థానంలో నిలిచిన 18వ వార్డుకి రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాలను అందించారు. నాల్గో స్థానంలో 17, 5వ స్థానంలో 81, 6వ స్థానంలో 15, 7వ స్థానంలో 55, 8వ స్థానంలో 23, తొమ్మిదో స్థానంలో 28, పదో స్థానంలో 31వ వార్డులు నిలిచాయి.

ఆహ్లాదకరంగా పోటీల నిర్వహణ



పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నం స్వచ్ఛతలో దేశంలో నాలుగో స్థానంలో నిలిచింది. విశాఖ నగరాన్ని పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దేందుకు వార్డుల మధ్య పోటీ నిర్వహించి తొలి 10 స్థానాల్లో నిలిచిన వార్డులకు ప్రోత్సాహక నగదు, ప్రశంసా పత్రాలు అందజేశాం. 10 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు స్వచ్ఛత సేవా బ్యాడ్జీలు బహూకరించాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

నగర ప్రజలకు అంకితం



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 4,477 నగరాలు పోటీ పడి విశాఖ నాలుగో స్థానం దక్కించుకుంది. ఈ విజయం నగర ప్రజలకు అంకితం. ఇంట్లోనే చెత్తను వేర్వేరు చేసి.. ఇంటి వద్దకు వచ్చే వాహనాలకు అందజేయాలి. బీచ్ క్లీనింగ్ యంత్రాల వినియోగంతో తీరం పరిశుభ్రంగా ఉంది. వార్డుల మధ్య పోటీతత్వం అవసరమని గుర్తించి ఈ అవార్డులు అందజేశాం.

– సీఎం సాయికాంత్‌వర్మ, కమిషనర్, జీవీఎంసీ

ప్రథమ బహుమతి: 52వ వార్డు



పార్కులో వ్యాయామ జిమ్

జీవీఎంసీ నిర్వహించిన పోటీల్లో తొలి స్థానంలో నిలిచిన 52వ వార్డులో ఎప్పటికప్పుడు రోడ్లు శుభ్రపరచడం, డ్రెయిన్లు క్లీన్ చేయడం, పచ్చదనాన్ని పరిరక్షిస్తూ పార్కులే గాక సెంట్రల్ మీడియన్లలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తున్నారు. ముఖ్యంగా పబ్లిక్ టాయ్‌లెట్స్ పరిశుభ్రంగా ఉంచడమే గాక ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నారు. తడి పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నారు. అద్దంలా రోడ్లు ఊడ్చడం, గెడ్డలు, కాలువలు పొంగిపొర్లకుండా ఎప్పటికప్పుడు సిల్ట్ తీయడం వంటి కార్యక్రమాలు చేపట్టి.. 52వ వార్డు ప్రథమ స్థానంలో నిలిచింది.

ద్వితీయ బహుమతి: 91వ వార్డు



91వ వార్డులో పబ్లిక్ టాయ్‌లెట్స్ ఇలా..

91వ వార్డు జనాభా సుమారుగా 20 వేలు. లక్ష్మీనగర్, గోపాలపట్నం, చిన బుచ్చిరాజుపాలెం, బాజీ జంక్షన్, పాత గోపాలపట్నం తదితర ప్రాంతాలు ఈ వార్డు పరిధిలో ఉన్నాయి. వార్డు పరిధిలో అపరిశుభ్ర వాతావరణానికి తావివ్వకుండా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో రోడ్లు, పరిసరాలు శుభ్రపరుస్తున్నారు. రోడ్డు స్వీపింగ్, ఇంటింటా చెత్త సేకరణ, ఎప్పటికప్పుడు మురుగు కాలువలు శుభ్రం చేయడం, వర్షపు నీరు ఎక్కడా నిలవకుండా చర్యలు చేపట్టడం, పచ్చదనాన్ని పరిరక్షిస్తూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడం తదితర చర్యలతో 91వ వార్డు రెండో స్థానంలో నిలిచింది.

తృతీయ బహుమతి: 18వ వార్డు



18వ వార్డులో పబ్లిక్ టాయ్‌లెట్లు

18వ వార్డు జనాభా 15 వేల పైబడి ఉంటుంది. ఎంవీపీకాలనీ సెక్టార్–2, 3, 6, 7, 9, 10 ఈ వార్డు పరిధిలోకి వస్తాయి. బీచ్ రోడ్డు తెన్నేటి పార్కు, రోప్‌వే నుంచి వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి వరకు, ఎంవీపీ డబుల్ రోడ్డు చర్చి వరకు విస్తరించి ఉంది. శతశాతం పరిశుభ్రతే లక్ష్యంగా ఎప్పటికప్పుడు చెత్త ఎత్తివేస్తారు. కాలువలు, గెడ్డలు నిత్యం శుభ్రపరుస్తుంటారు. 100 శాతం ఇంటింటా చెత్తను సేకరిస్తున్నారు. ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ, సెంట్రల్ మీడియన్, ఫుట్‌పాత్‌లు శుభ్రపరుస్తూ పచ్చదనాన్ని పరిరక్షిస్తున్నారు. పారిశుధ్యానికి సంబంధించి స్థానికులతో చర్చించి పలు నిర్ణయాలు తీసుకుంటారు. ఇలా పలు కార్యక్రమాలతో 18వ వార్డు మూడో స్థానంలో నిలిచింది.

నేటి తరానికి ‘పీవీ’ మార్గదర్శకుడు



మాట్లాడుతున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

సీతమ్మధార : తెలుగుతేజం, మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు నేటి తరానికి మార్గదర్శకుడని వైఎస్సార్ సీపీ యువ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ తెలిపారు. నరసింహారావుకు భారతరత్న లభించడంపై ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వైజాగ్ బ్రాహ్మిన్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రముఖ న్యాయవాది కేవీ రామమూర్తి మాట్లాడుతూ పీవీ నరసింహారావు తెలుగువారి ఖ్యాతిని చాటిచెప్పారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారిణి వై.వి.అనురాధ మాట్లాడుతూ పీవీ నరసింహారావు రాజకీయ, ఆర్థిక, సామాజిక, భాషా సాహిత్య రంగాల్లో సంపన్నులు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యులు సుహాసిని ఆనంద్, ఏయూ విశ్రాంత అధ్యాపకులు పి.ఎస్.అవధాని, వుడా మాజీ చైర్మన్ రవి, బత్తుల శ్రీనివాస్, వైజాగ్ బ్రాహ్మిన్ వెల్ఫేర్ సొసైటీ గౌరవాధ్యక్షుడు టీఎస్ఆర్ ప్రసాద్, విప్రోత్సవం కన్వీనర్ పి.వి.నారాయణ, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు ఆహ్వానితుడు కె.నర్సింహమూర్తి , న్యాయవాది ఆకెళ్ల రమణమూర్తి, సాయిరామ్, శంకర్ నీలు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘వైఎస్సార్ సీపీ గెలుపే బీసీ సంఘాల లక్ష్యం’



మాట్లాడుతున్న ప్రసాదనాయుడు

డాబాగార్డెన్స్: వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు బీసీ సంఘాలు ఐక్యంగా పని చేయాలని ఆలిండియా జ్యోతి బాపూలే బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ప్రసాద్‌నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని బీసీ సంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బిహార్ తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రమే కులగణన నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న విద్యా విధానాలు, నాడు–నేడు అభివృద్ధి పనులు మిగిలిన రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సంక్షేమ పథకాలు అందించడమే గాక అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. వీటన్నింటిపై గ్రామస్థాయి నుంచి ప్రజలకు వివరించి.. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లు సాధించే విధంగా బీసీ సంఘాలు పనిచేయాలని కోరారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో పర్యటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధిపై ప్రజలను చైతన్యవంతులు చేస్తామన్నారు. ఆ తర్వాత విశాఖ వేదికగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ సదస్సు నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ సభ్యులు సూరాడ దాసు, ఆది వెంకట సత్యనారాయణ, వెంకట బాబ్జీ, ఎర్రయ్య పాల్గొన్నారు.

కంబాలకొండలో ట్రెక్కింగ్



కంబాలకొండలో ట్రెక్కింగ్ చేసిన పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆరిలోవ: నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో ప్రత్యేకమైన కంబాలకొండ ఎకో టూరిజం పార్కులో అక్కయ్యపాలేనికి చెందిన పోర్టు స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ట్రెక్కింగ్ చేశారు. సుమారు 70 మందికి సభ్యులు ట్రెక్కింగ్‌లో పాల్గొని ఉత్సాహంగా రెండు కిలోమీటర్ల నడక సాగించారు. సన్నని దారిలో గుట్టలు, వాగులు దాటుకుంటూ.. పలు రకాల పక్షుల కిలకిలరావాల నడుమ ట్రెక్కింగ్ చేశారు. కంబాలకొండలో క్యాంటీన్ సమీపంలో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. అక్కడ జరిగిన సమావేశంలో అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ రామ్‌నరేష్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ట్రెక్కింగ్ ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. ఔషధ మూలికలు ఉండే కంబాలకొండ ట్రెక్కింగ్ నిర్వహించడం మరింత ఆరోగ్యకరమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు, కార్యదర్శి విఠల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- ఇంటి యజమాని చిన్నయ్య మృతి
- భార్య, కుమార్తెలకు తప్పిన ప్రాణాపాయం



చిన్నయ్య మృతదేహం

తగరపువలస: పద్మనాభం మండలం ఏనుగులపాలేనికి చెందిన కొమ్మూరి చిన్నయ్య కుటుంబం నిద్ర మాత్రలు తీసు కుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. ఈ ఘటనలో అతని భార్య మంగ, కుమార్తెలు అనుప్రియ, మానస ప్రాణాలతో బయటపడగా.. చిన్నయ్య మృతి చెందాడు. మృతుడి అన్నయ్య వెంకన్న ఈ మేరకు పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మద్యానికి బానిస అయిన చిన్నయ్య డ్రైవింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల అప్పులు పెరిగిపోడంతో పాటు భార్య మంగ అనారోగ్యం అతనిని తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. ఈ నేపథ్యంలో కుమార్తెల పెళ్లిళ్లు చేయలేనని కుంగిపోయాడు. ఈ విషయం భార్యాపిల్లలకు చెప్పి నిద్రమాత్రలు తీసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నారు. మద్యం ద్వారా చిన్నయ్య, పాలు ద్వారా మంగ నిద్రమాత్రలు తీసుకోగా పిల్లలకు సబ్జాలు కలిపిన నీళ్లతో వీటిని అందించారు. తర్వాత 108 వాహన సిబ్బందికి ఫోన్ చేసి తాము ఆత్మహత్య చేసుకుంటున్న ట్టు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే చిన్నయ్య చనిపోయాడు. మిగిలిన వారిని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించగా ప్రాణాలతో బయటపడ్డారు. తమ్ముడు మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని, వారి ఇంట్లో పరిస్థితులే కారణమని వెంకన్న తెలిపాడు. అనుప్రియ కేజీహెచ్‌లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదువుతుండగా, మానస బోయిపాలెం ఈస్ట్రన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతోంది. ఈ కేసును ఎస్‌ఐ జె.సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



బీవీకే కాలేజీలో నిర్వాహకులకు సూచనలు ఇస్తున్న ఆర్‌ఐవో మురళీధర్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ జనరల్ కోర్సులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో 129 కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలు జరిగాయి. నగరంలోని పలు కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి. మురళీధర్ పరిశీలించారు. పరీక్షల నిర్వహణపై కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, పరీక్షలు జరుగుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఎగ్జామినర్లుకు మార్కుల నమోదుపై సూచనలు చేశారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్‌ఐవో మురళీధర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 6,992 మందికి గానూ 6823 హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 5,179 మందికి గానూ 5,111 మంది హాజరయ్యారు.

తాళం వేసిన ఇళ్లే అతని టార్గెట్

- నగరంలో పలు చోట్ల దొంగతనాలు
- నిందితుడు కర్నాటకకు చెందిన మోహన్‌కృష్ణగా గుర్తింపు
- మూడు బృందాలతో గాలింపు చర్యలు



మధురానగర్‌లో చోరీకి గురైన ఇంటిని పరిశీలిస్తున్న క్రైం డీసీపీ రత్నం

సీతమ్మధార: గాజువాక, సీతంపేట, మధురానగర్, పీఎంపాలెం తదితర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడింది మోహన్‌కృష్ణగా పోలీసులు గుర్తించారు. అతడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. పోలీసులకు సవాల్ విసిరి దొంగతనాలు చేస్తున్న కర్నాటకకు చెందిన మోహన్ కృష్ణపై ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో అధిక సంఖ్యలో ఇంటి దొంగతనం కేసులు ఉన్నాయి. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తూ.. ఇంటికి తాళం వేసి ఉంటే వెంటనే చోరీ చేయడంలో అతను సిద్ధహస్తుడు. సీతంపేట దుర్గాగణపతి ఆలయం వెనుక నలుగురు యువకులు అద్దెకు ఉంటున్న గదిలో, మధురానగర్‌లోని ఓగ్రూప్ హౌస్‌లో శనివారం చోరీలు జరగ్గా.. మోహన్‌కృష్ణే నిందితుడని పోలీసులు గుర్తించారు. దీంతో మూడు బృందాలుగా ఏర్పడి కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. నగరంలో దొంగతనాలు జరిగిన ఇళ్లతోపాటు ఇతర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. పాత నేరస్తులను విచారిస్తున్నారు.

ఏపీ ప్రైవేట్ స్కూల్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావును అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కంచరపాలెం: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నగరానికి చెందిన బి.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం తిరుపతిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శ్రీనివాసరావు.. సంఘం ప్రతినిధుల చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. కంచరపాలెంలోని ఓ న్యూటన్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావు ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

బులియన్..

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు: రూ.57,700
24 క్యారెట్లు: రూ.62,950	వెండి (కిలో): రూ.76,500